ప్రజాశక్తి

శనివారం 17 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



ధర్నా చేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

'ఉక్కు'లో సమ్మె సైరన్

- ఈ నెల 20 నుంచి ప్రారంభం
- జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 20 నుంచి కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. అదే క్రమంలో ఈ నెల 20న పర్మినెంట్ కార్మికులు ఒక్కరోజు సమ్మెకు దిగుతున్నారు. వాటిని జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన పలు డిమాండ్లపై స్టీల్‌ప్లాంట్ బిసి గేట్ వద్ద ధర్నా జరిగింది. స్టీల్ కార్మికులకు అక్రమంగా ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్లు ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను ఎవరినీ తొలగించరాదని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా సాగింది. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అప్రకటిత మిగతా 2లో..



సమ్మిట్‌లో పాల్గొన్న కొండపల్లి శ్రీనివాస్

పర్యావరణ సమతుల్యత పాటిస్తూనే పారిశ్రామికాభివృద్ధి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వార్త మెయిన్‌లో..

23న హైదరాబాద్.. 30న బెంగళూర్

- విశాఖలో భూముల పిపిపికి రోడ్డుషోలు
- కాపులుప్పాడలో 87.80 ఎకరాలపై పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య ప్రణాళిక
- విఎంఆర్‌డిఎ తాజా కసరత్తు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



మాట్లాడుతున్న ప్రణవ్ గోపాల్

విశాఖలో భూములను పిపిపిలో అభివృద్ధి చేసేందుకు గానూ ఈ నెల 23న హైదరాబాద్, 30న బెంగళూరులో విఎంఆర్‌డిఎ రోడ్డుషోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ శుక్రవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ ఉన్నతాధికారులు, క్రెడాయ్, నరెడ్కో, ఎపిరెడా ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి దీక్షలో భాగంగా మధురవాడలోని 87.80 ఎకరాల భూమిని పబ్లిక్, ప్రైవేట్ పద్ధతిలో జాయింట్‌గా డవలప్‌చేసేందుకు అవకాశాలు ఉన్నాయని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు ఛైర్మన్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'ఉక్కు'లో సమ్మె సైరన్

ఎమర్జెన్సీని యాజమాన్యం అనుసరిస్తోందని అన్నారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ యాజమాన్య వైఖరి ఉందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గళమెత్తిన కార్మిక సంఘాలపైనా, కార్మికులపైనా కక్ష సాధింపు చర్యలకు దిగడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో . పూర్తిస్థాయి ఉత్పత్తి జరగాలంటే తగిన మానవ వనరులు ఉండాలని యాజమాన్యానికి తెలీదా ? అని ఆయన ప్రశ్నించారు. కార్మిక సమస్యలను సృష్టిస్తూ యాజమాన్యం అనైతికంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్లాంట్‌లో సమ్మె జరిగి తీరుతుందన్నారు. స్టీల్ కార్మికులకు నేటికీ పూర్తి వేతనాలు చెల్లించడం లేదన్నారు. హెచ్‌ఆర్‌ఎకు కోత విధించి, కరెంటు ఛార్జీలు పెంచి కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను వారి ఉపాధి నుంచి దూరం చేసి స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులకు తీవ్ర విఘాతాన్ని సృష్టిస్తున్నారన్నారు. యాజమాన్యం ఇదే వైఖరిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి.రమణారెడ్డి, టి.జగదీష్, జె.రామకృష్ణ, స్టీల్ సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, నాయకులు పి.శ్రీనివాసరాజు, మరిడయ్య, టివికె.రాజు, వి.ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మహేష్, రాజు, శ్రీనివాస్, స్టీల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బి.తౌడన్న, ఎఐటియుసి నాయకులు మసేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

23న హైదరాబాద్.. 30న బెంగళూర్

వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి విశాఖపట్నం వరకూ బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా ఇప్పటికే డబల్ డెక్కర్ మోడల్‌లో డిపిఆర్ సిద్ధమైన మెట్రో రైలు ప్రాజెక్టు పనులను కూడా 3 నుంచి 6 నెలలో వ్యవధిలో ప్రారంభించే చర్యలపై సమావేశంలో చర్చించారు. ఇలా ప్రారంభించి వచ్చే మూడున్నరేళ్లలో అంటే 2029 నాటికి మెట్రో రైల్ ఆచరణ సాధ్యం చేసే దిశగా ప్రయత్నాలు చేయాలని తెలిపారు. పైన తెలిపిన 87.80 ఎకరాల భూమి కన్వెన్షన్ సెంటర్లు, హాస్పిటాలిటీ, రెసిడెన్షియల్, కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర నిర్మాణాలకు అనువుగా ఉన్న ప్రదేశంగా విఎంఆర్‌డిఎ గుర్తించినట్లు ఛైర్మన్ వెల్లడించారు. మెట్రో స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే ఈ ప్రదేశం ఉంటుందని, ముఖ్యమైన రహదారులతో అనుసంధానమై ఉందని తెలిపారు. డేటా సిటీ ఆఫ్ సౌత్ కాపులుప్పాడకు ఒక కిలోమీటరు దూరంలో ఐటి సిటీ ఉండడం వల్ల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడ్డారు.



మేయర్‌ను సత్కరిస్తున్న జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మేయర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పివివి.నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.సంజీవరెడ్డి, పలువురు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగర మేయర్ పదవిని అధిరోహించినందుకుగానూ అభినందనలు తెలుపుతూ శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సత్కార సభలో మేయర్ మాట్లాడుతూ జివిఎంసి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను దక్కించుకున్న జివిఎంసి కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఇప్పటికే పనులను పూర్తి చేసి, మిగిలిన పనులను ప్రారంభించేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయాలని అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను కోరగా ఆయన స్పందిస్తూ సంబంధిత కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లుల విడుదలపై కలెక్టర్‌తో చర్చించి బిల్లులను అందించే ఏర్పాటు చేస్తానన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో మండుటెండలు విపరీతంగా ఉన్నందున వేసవి తాపానికి నగర ప్రజలు గురికాకుండా ఉండేందుకు జివిఎంసి అన్ని జోన్లలో ప్రజల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన జోన్ -4లోగల జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి ఈ శుక్రవారం నాలుగు వినతులు వచ్చాయని జివిఎంసి సిటీ ప్లానర్ కె.ధనుంజయ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసిటౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ఐఐపిఇ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపిఇ) స్నాతకోత్సవాన్ని ఈ నెల 17వ తేదీ శనివారం బీచ్ రోడ్‌లోని హోటల్ నోవటల్ వేదికగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందుస్థాన్ జింక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, హోల్ టైం డైరెక్టర్ అరుణ్ మిశ్రా హాజరవుతారని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆంధ్ర యూనివర్సిటీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 51 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. వీరిలో 15 మంది ఎంఎస్‌సి విద్యార్థులు, ఎనిమిది మంది పెట్రోలియం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నారన్నారు. అదేవిధంగా ఈ ఏడాది నుండి పెట్రోలియం ఇంధన సంబంధిత రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికిగాను విద్యలో అసాధారణ ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగాల నుండి ఇద్దరు బాలికలను ఎంపిక చేసి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. ఓవరాల్ విభాగంలో ఒక విద్యార్థికి రాష్ట్రపతి బంగారు పతకం కూడా అందజేస్తామని వెల్లడించారు. అనంతరం ఆర్ అండ్ డి డీన్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థలో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్‌లలో బిటెక్, అప్లైడ్ జియాలజీలో ఎంఎస్సీ, డేటా సైన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌లో వెబ్ ఆధారిత ఎంటెక్, పలు విభాగాలలో పిహెచ్‌డి ప్రోగ్రాములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ సంస్థను హెచ్‌పిసిఎల్, ఒఎన్‌జిసి, ఒఐఎల్, గెయిల్, ఐఒసిఎల్ వంటి ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రమోట్ చేస్తున్నాయని తెలిపారు.



స్నాతకోత్సవ వివరాలను వెల్లడిస్తున్న ప్రొఫెసర్ శాలివాహన

తమ సంస్థలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు బిటెక్ విభాగంలో 93.75 శాతం, ఎంఎస్సీ అప్లైడ్ జియాలజీలో 86.66 శాతం, ఎంఎస్సీ అప్లైడ్ జియాలజీలో 100 శాతం ప్లేస్మెంట్స్ లభిస్తున్నాయని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఐఐటిఇ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ అధ్యక్షులు ప్రొఫెసర్ పికె.బానిక్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ హిమాంషు కాకతీ, ఐఐపిఇ రిజిస్ట్రార్ రాంపాల్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

డీప్‌టెక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశ్రామిక శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యారంగం - పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ప్రత్యేక పారిశ్రామిక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నగరంలోని టెక్ మహేంద్ర కార్యాలయంలో ప్రారంభించింది. ఈ సందర్భంగా డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ముందుకు సాగుతున్న కొద్దీ యువ శ్రామిక శక్తి ఒక క్లిష్టమైన సవాలును ఎదుర్కొంటోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద యువ జనాభా ఉన్నప్పటికీ విద్యా పాఠ్యాంశాలు, పరిశ్రమ అవసరాల మధ్య అనుసంధానం లేకపోవడంతో ఆర్థిక పురోగతి మందగించే ప్రమాదం ఉందన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య సహకారం లేకపోవడం ఈ అంతరానికి కీలక కారణమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిపిఐ అదనపు డైరెక్టర్ సురేష్ బాతా, క్వాంట్ సిస్టమ్స్ డైరెక్టర్ శ్రీహరి, డబ్ల్యుఎన్ఎస్ లొకేషన్ లీడర్ ఆర్ఎల్.నారాయణ, టెక్ మహీంద్రా లీడర్‌షిప్ కౌన్సిల్ సభ్యుడు జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు

వాలంటీర్లను మోసం చేసిన కూటమి

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాలంటీర్ల వ్యవస్థను రోడ్డున పడేసి కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ధ్వజమెత్తారు. గతంలో వాలంటీర్‌గా పని చేసిన అంగటి శ్రీనివాసరావు తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసి అతడిని వాసుపల్లి శుక్రవారం పరామర్శించారు. తక్షణమే సొంత నిధులు రూ.10 వేల నగదును అందజేసి భరోసా కల్పించారు. గతంలో 27వ వార్డు దొండపర్తి నెహ్రూ బజార్ 143 సచివాలయంలో అంగటి శ్రీనివాసరావు, ఆయన భార్య అంగటి పార్వతి దంపతులిద్దరూ వాలంటీర్లుగా ఉద్యోగాలు చేస్తూ కుటుంబం పోషించుకునేవారని అన్నారు.

కూటమి హయాంలో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలను మోసం చేసి అందలం ఎక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకొని వాలంటీర్లకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్, వైసిపి విశాఖ జిల్లా కార్యదర్శి పద్మనాభం అమ్మాజీ, పార్టీ వార్డు ప్రెసిడెంట్ నీలపు సర్వేశ్వర రెడ్డి, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యప్రకాష్

ప్రజాశక్తి- సీతమ్మధార: ఎపిఇపిడిసిఎల్ పరిధిలో విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం, నిరంతరాయ విద్యుత్తు సరఫరాకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ టివి సూర్యప్రకాష్ తెలిపారు. గణనీయంగా పెరిగిన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేసుకొని నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా,ప్రతి శుక్రవారం ప్రాంతాల వారీగా విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ పనులు చేపడుతూ, ఆ సమాచారాన్ని వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే తెలియజేస్తున్నామన్నారు.

గురువారం రాత్రి అనకాపల్లి జిల్లాలో పెనుగాలులు వర్షం కారణంగా మాడుగుల మండలంలోని సత్యవరం గ్రామంలో 20 ఎల్‌టి, 7 హెచ్ టి స్తంభాలు విరిగిపడడంతో సత్యవరం గ్రామంతో పాటు డి.గొట్టివాడ, సాగరం, కొత్తవలస, కెవేలంపాడు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, శుక్రవారం ఉదయం 10 గంటల లోపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంతో పాటు సర్కిల్, డివిజన్ స్థాయిల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాల పర్యవేక్షణకు లోడ్ మానిటరింగ్ సెల్ 24X7 పనిచేస్తున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలపై 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



ప్రత్యేక అవసరాల పిల్లలతో ఎంఇఒ శివరాణి, తదితరులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 18 ఏళ్ల లోపున్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారి గీత తెలిపారు.పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు ఈ నెల 12న ప్రారంభమైన కార్యక్రమం వచ్చేనెల 9 వరకు జరుగుతుందని వివరించారు.

ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని మూలకుద్దు గ్రామంలో ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. . ఇప్పటి వరకు మండలంలో ఆరుగురు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు గీత తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి అప్పలనాయుడు, ఎంఇఒ ఎం.శివరాణి, హెచ్‌ఎం డి.దాలయ్యబాబు, భవిత స్కూల్ ఉపాధ్యాయులు కె జియాకుమారి, పార్వతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు

రాత్రి కబ్జా..పగలు చదును!

- **జివిఎంసి 88వ వార్డు వుడా లేఅవుట్‌లో చోటా నేతల దందా**
- **1.15 ఎకరాల పార్కు స్థలంలోనూ అక్రమంగా ప్లాట్లు**



కబ్జా చేసిన స్థలాన్ని చదును చేస్తున్న ప్రొక్లెయినర్

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 88వ వార్డు నరవ ప్రాంతంలో భూఆక్రమణలు, అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు నేతలు వాలిపోతున్నారు. ప్రభుత్వ స్థలం అయితే ఇక అంతేసంగతులు, కబ్జా చేసేస్తున్నారు. రాత్రి స్థలాన్ని ఆక్రమించడం, పగటి వేళ చదును చేయడం ఇక్కడ నిత్యకృత్యంగా మారిపోయింది. ఇప్పటికే స్థానికులు పలు ప్రభుత్వ విభాగాలకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే వారి స్పందన అంతంతమాత్రంగా ఉండడం, చేపట్టిన చర్యలు ఉదాసీనంగా ఉండడంతో ఈ అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోతోంది.

విచిత్రం ఏంటంటే ఇటీవల పార్కు స్థలాన్ని కబ్జా చేసేసి, ప్లాట్లు వేసి విక్రయించగా, తాజాగా చెరువు స్థలాన్ని ఆక్రమించేసి చదును చేసేస్తున్నారు. స్థానిక వైసిపి చోటా నేతలే ఈ అక్రమ బాగోతానికి పాల్పడుతున్నారనంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

కోట నరవ సమీపంలోని ఆకృతి వుడా లేఅవుట్‌లో పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు స్పందించి, ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి 10ఎకరాల్లో వుడా లేఅవుట్ వేయగా, అందులో 172ప్లాట్లు ఉన్నాయి. అక్కడే 1.15 ఎకరా స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఇప్పుడా స్థలంలోనే ఆక్రమణలు జరిగాయని వుడా కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. రాత్రి కబ్జా చేసి, పగటి వేళ వాహనాల సాయంతో చదును చేసేస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. వాహనాల రాకతో ఇక్కడి రోడ్లు కూడా ఛిద్రమైపోతున్నాయని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి, ప్రభుత్వ భూముల కబ్జాను అరికట్టడంతోపాటు వాటిని పరిరక్షించాలని, ప్రజా ప్రయోజనానికి వాటిని వినియోగించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, చర్యలు తెలియాలి.

కాసులు కురిపిస్తున్న ఖైదీల వ్యవసాయం

- **సెంట్రల్ జైలులో మామిడి ఫల ఆదాయం రూ.1.30లక్షలు**



సెంట్రల్ జైలు ఖైదీలు సాగు చేస్తున్న మామిడితోటలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ సెంట్రల్ జైలులో ఖైదీలు కర్షకులుగా మారి సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోవడంతో పాటు కేంద్రకారాగారానికి ఆదాయం సమకూర్చుతున్నారు. ఖైదీల నిర్వహణలో జైలులో చిన్న పరిశ్రమలు, డైరీ ఫారంతో పాటు కాయగూరలు, పండ్ల చెట్లు పెంపకం ద్వారా ఏటా ఆదాయం సమకూరుతుంది. శిక్షణ పడ్డ ఖైదీలు కేంద్రకారాగారం లోపల చిన్న పరిశ్రమల్లో వారి ప్రావీణ్యత బట్టి పనిచేస్తుంటారు. మంచి ప్రవర్తన కలిగిన ఖైదీలు అంటే ఏదైనా జిఒ వస్తే విడుదలకు సిద్ధంగా ఉండే ఖైదీలు జైలు ఆవరణలో ఉన్న ప్రదేశంలో వ్యవసాయ క్షేత్రంలోను, డైరీఫారంలోను పనిచేస్తుంటారు. వీరే వ్యవసాయం చేస్తుంటారు. కాలానుగుణంగా పండే పంటలను, పశువుల మేతకు గడ్డిని కూడా ఇక్కడే పండిస్తారు.. అలాగే కేంద్రకారాగారం ఆవరణలో ఉండే ఖాళీ స్థలాల్లో ఉండే మామిడి తోటలో పండ్లను పండిస్తారు. మామిడి పండ్ల ద్వారా ఆదాయం ఏడాదికేడాది పెరుగుతూ వస్తుంది. గత ఐదేళ్ళ ఆదాయాన్ని గమనిస్తే 2020లో రూ 65 వేలు, 2021లో రూ 1.20 లక్షలు, 2022లో రూ.52 వేలు, 2023లో రూ 1.40 లక్షలు, 2024లో రూ 80 వేలు రాగా ఈ ఏడాది రూ 1.30 లక్షల ఆదాయం వచ్చినట్టు కేంద్రకారాగారంలో పర్యవేక్షణాధికారి మహేష్‌బాబు తెలిపారు.

మొరాయిస్తున్న సర్వర్లు

- **పింఛన్లు, రేషన్‌కార్డుల దరఖాస్తుకు ప్రజల పాట్లు**



దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

ప్రజాశక్తి - ఆనందపురం : నూతన రేషన్ కార్డులు, పింఛన్లు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఇన్నాళ్లుగా ఎంతో ఆశతోఎదురుచూస్తున్న లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయం వద్ద బారులు తీరుతున్నారు.మండలంలో మేజర్ పంచాయతీ ఆనందపురం సచివాలయంలో నూతనంగా రేషన్ కార్డులు, వితంతు పింఛన్లు మంజూరుకు దరఖాస్తు ప్రక్రియ మొదలు కావడంతో వాటి దరఖాస్తుకు ఒక్కసారిగాపెద్దఎత్తున ఆశావహులు తరలిరావడంతో సర్వర్లు మొరాయించడంతో వారు పడిగాపులు పడక తప్పడం లేదు. దీంతో సచివాలయాల వద్ద దరఖాస్తుదారులు బారులుదీరి, అవస్థలు పడుతున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల పనివేళలోల రెండుమూడుకు మించి దరఖాస్తులు ఆన్‌లైన్ జరగడం లేదని, సర్వర్ పనిచేయకపోవడంతో ఏం చేయలేని స్థితిలో ఉన్నామని డిజిటల్ అసిస్టెంట్ వెంకటరావు అంటున్నారు.

కుటుంబ సభ్యులంతా ఇకెవైసి వేయాల్సి ఉండగా, పెద్దసంఖ్యలో వచ్చిన దరఖాస్తుదారులంతా కుటుంబాలతో పడిగాపులు పడుతున్నారు. ఆనందపురం ఒక్క పంచాయతీలోనే రోజుకు 30 వరకు రేషన్‌కార్డు దరఖాస్తులు, వితంతు పింఛన్ల దరఖాస్తుకు మరో పదిమంది, ఇతర కార్యకలాపాలకు మరో పది ఇలా 50మంది దాకా వస్తుండగా, వీరిలో ఇద్దరి ముగ్గురి పనిమాత్రమే ఒకరోజులో జరుగుతున్న పరిస్థితుల్లో ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్వతుందోనని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. ఆనందపురం సచివాయంలో సర్వర్ సమస్యతోపాటు సిబ్బంది కొరత కూడా ఉందని, అందుకే పనుల్లో జాప్యం జరుగుతున్నందున ప్రజలు గమనించాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేయాలని వేడుకుంటున్నారు.

అన్నదాత సుఖీభవ వివరాల నమోదుకు పాట్లు

ఆనందపురం సచివాలయంలో అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రభుత్వం నిర్ధేశించిన అన్నదాత సుఖీభవకు రైతుల భూవివరాల నమోదు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 18లోగా వివరాల నమోదుకు గడువు పెట్టడంతో ఏంచేయాలో పాలుపోక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ లైన్‌మ్యాన్ కూడా లేకపోవడంతో పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని స్థానికులు అంటున్నారు.

నేరాలు ఘోరాలు

అదుపుతప్పిన కారు

- నవ దంపతులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో నవదంపతులు, వారి కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి జిల్లా, కసింకోట మండలం నూతగుంటపాలెం గ్రామానికి చెందిన కలిగెట్ల వీరబాబు (వినయ్), యామినిలకు శుక్రవారం వేకువజామున వివాహం జరిగింది. నవ దంపతులు కుటుంబ సభ్యులతో అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతానికి కారులో వెళ్లి, తిరిగొస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సారిపల్లి పాలెం జంక్షన్ వద్ద టైర్ పేలడంతో అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి రోడ్డు వైపు దూసుకుపోయింది. ఈ ఘటనలో నవ దంపతులు వీరబాబు, యామిని లతోపాటు కుటుంబ సభ్యులు ఎల్.వైష్ణవి, ఆశ, డి..రోషిణి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరికి నక్కపల్లి ఆసుపత్రిలో వైద్యులు చికిత్సను అందించారు. పెద్ద ప్రమాదం నుండి బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు

ప్రజాశక్తి-మధురవాడ : రహదారిపై ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా పుట్టినరోజు వేడుకలను జరుపుకున్న మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ జి. బాలకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలివి. జివిఎంసి మాజీ కార్పొరేటర్ పోతిన హనుమతురావు తన పుట్టినరోజు వేడుకలను ఐటి కూడలి సమీపంలోని మ్యాగీ పాయింట్ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా రోడ్డుకు అడ్డంగా కేకు కోసి వేడుకలు నిర్వహించారు. దీనిపై పోలీసులకు స్థానికుల సమాచారం మేరకు సమీపంలోని ఐటి కూడలి వద్ద పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని కుసులువాడ పంచాయతీ రేగానిగూడెంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలోరెండు పూరిళ్లు దగ్ధమైనాయి. గ్రామానికి చెందిన రేగాని పైడమ్మ పూరి గుడిసెలో వంట చెరుకు కారణంగా నిప్పు అంటుకుని ఒకటి పూర్తిగా, మరొకటి పాక్షికంగా అగ్నికి దగ్ధమయ్యాయి. స్థానికులు తాళవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన చేరుకొని మంటలను అదుపు చేశారు.పురిపాకలో ఉన్న బట్టలు, సామాన్లు కాలిపోయాయి. సుమారు రూ. 35వేల విలువైన సామాన్లు బూడిదయ్యాయి. చుట్టుపక్కల ఇల్లు ఉండడం, మంటలను అదుపులోకి తీసుకురావడంతో అగ్నిమాపక సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. పైడమ్మను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి -తగరపువలస : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాతో ఆరోగ్య ప్రయోజనాలపై కళాశాల అధ్యాపకులకు అవగాహన కల్పించారు బ్రహ్మకుమారి శివలీల మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ఎవరి స్థాయిలో వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు..యోగా, ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. సమస్యలెన్ని ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

రమణరావు కుటుంబాన్ని పరామర్శించిన రమాదేవి



సుభద్రాదేవిని పరామర్శిస్తున్న రమాదేవి

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు పివివి రమణరావు కుటుంబ సభ్యులను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి శుక్రవారం పరామర్శించారు. చిన్న గంట్యాడలోని ఆయన నివాసానికి వెళ్లి రమణరావు భార్య సుభద్రా దేవిని పరామర్శించారు. తుదిశ్వాస విడిచేవరకు పార్టీ కోసం కష్టపడిన గొప్ప వ్యక్తి రమణరావు అని రమాదేవి కొనియాడారు. గాజువాకలో పార్టీ అభివృద్ధికి రమణరావు చేసిన కృషి, కష్టం, ఆయన ఉద్యోగ ప్రస్థానం, ఇతరత్రా అనేక విషయాలను ఈసందర్భంగా ఆయన కుటుంబసభ్యులతో ప్రస్తావించారు. రమణరావు కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో ఐద్వా కార్యదర్శి వై సత్యవతి, సంతోషం, లక్ష్మి, సుమిత్ర ఉన్నారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్‌పై రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న చిన్నంనాయుడు

ప్రజాశక్తి-గాజువాక : ఏజెన్సీ ప్రాంతాల్లో 100శాతం ఉపాధ్యాయ నియమకానికి స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ఈనెల 20న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయాలని, ఆదివాసి గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కె .చిన్నంనాయుడు, జివి రమణమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవన్‌లో నిర్వహించిన ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లాకమిటీ సమావేశంలో మాట్లాడుతూ,మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులను మినహాయించి, వాటికి ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన విడుదల చేయాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ సమీక్షలో మూడు అప్షన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలిస్తున్న వార్తలు వెలువడిన నేపథ్యంలో, ఆదివాసులకు పూర్తి న్యాయం జరగాలంటే ఏజెన్సీలోని ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను వందశాతం గిరిజనులతోనే నియామకాలు చేపట్టడ మొక్కటే మార్గమన్నారు. ఇతర ఏ ఆప్షన్ అయినా గిరిజనులకు తీరని నష్టంజరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జిఒ3 ప్రయోజనాలతో ఏజెన్సీ ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు గిరిజనులతో భర్తీ చేసేలా ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలని, దీనిపై రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానించాలన్నారు. అంతవరకు మెగాడిఎస్‌సిలో ఏజెన్సీలోని ఉపాధ్యాయ ఖాళీలను మినహాయించాలని కోరారు. మెగా డిఎస్‌సి దరఖాస్తు గడువు ఈనెల 15తో ముగిసిన నేపథ్యంలో దానిపై ముందుకు వెళ్లక ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని తగు చర్యలు చేపట్టి, ఆదివాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఎస్ దామోదర్, టీ చిట్టిబాబు, కుల దాస్, సిహెచ్ కోటి బాబు, రామ్మోహనరావు పాల్గొన్నారు.

21నుంచి జూపార్కులో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాల, జివియంసి, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ ట్రస్ట్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో జూ పార్కులో ఈనెల 21 నుంచి 25 వరకు ఐదు రోజులపాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ పార్కు బయోస్కోపు మందిరంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో జంతు ప్రపంచం, వాటి పరిరక్షణ చర్యలపై ఆసక్తి, అవగాహనను పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు జూ వెటర్నరీ ఆసుపత్రి సందర్శన, జంతు సంరక్షకులతో ఇంటరాక్టివ్ సెషన్లు, పక్షుల వీక్షణ, జంతువుల నివాసాలు, ఆహారపు అలవాట్ల అన్వేషణ ఉంటుందన్నారు. క్యాంప్‌లో పాల్గొనే వారికి క్యాంప్ సర్టిఫికేట్, జంతు థీమ్ టీర్టు, ఐఙజెడ్‌పి బుక్, జంతు సంబంధిత బ్రోచర్లు అందజేయనున్నట్లు తెలిపారు. దీనిలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ 1,000లు చెల్లించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మరిన్ని వివరాల కోసం జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఫోన్ 7893632900 నెంబరును సంప్రదించవచ్చన్నారు.


సమస్యలపై జెడ్‌సికి వినతి



జెడ్‌సిని అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు జివిఎంసి జోనల్ చైర్మన్ బమ్మి అయ్యప్పనాయుడును కోరారు. శుక్రవారం జోనల్ కార్యాలయంలోని జెడిసి చాంబర్‌లో మూడో వార్డు టిడిపి కమిటీ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు తదితర సదుపాయాల కల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఇటీవలే బదిలీపై వచ్చిన జెడ్‌సికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చురకల రమణ, కె నాగ రాజు, ఎం సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, జి శ్రీనివాస రావు, ఎస్ జోగారావు, వియ్యపు పోతురాజు పాల్గొన్నారు.

6జి కమ్యూనికేషన్స్‌పై గీతంలో ముగిసిన ఎఫ్‌డిపి



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యాకల్టీ, గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్లపై ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎన్ఐటి వరంగల్ నుంచి ప్రొఫెసర్ మహమ్మద్ ఫరూఖ్ హష్మి ఐఒటి అప్లికేషన్ల కోసం కృత్రిమ మేధస్సుపై వివరించారు. 6జిలో ప్రాముఖ్యత, సవాళ్లను కమ్యూనికేషన్లు, ఆర్.ఎఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, సిస్టమ్ డిజైన్ అంశాలపై వివరించారు. 5జి, 6జి సెల్యూలార్ సిస్టమ్‌ల కోసం వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఛానల్ అంశాలు, సహకార కమ్యూనికేషన్ల, అనుకరణ నమూనాలను తదుపరి తరం 6జి వ్యవస్థలను భద్రపరచడం, పారిశ్రామిక ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 4.0 అప్లికేషన్ అభివృద్ధిని వివరించారు. ముగింపులో పాల్గొన్న ప్రతిభావంతులందరికీ గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇఇసి విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్లు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ సిహెచ్.సుధీర్, డాక్టర్ టి.గౌరి, సర్టిఫికేట్లు అందజేశారు. సదస్సులో ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో పార్కుల అభివృద్ధికి నిధులు

- గ్రేటర్ విశాఖ మేయర్ పీలా



శంకుస్థాపన చేస్తున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -సీతమ్మధార : .నగరంలో జాతీయ రహదారిని అనుకుని వున్న గ్రీన్‌బెల్ట్‌లో పార్కుల అభివృద్ధి, వాకింగ్‌ట్రాక్‌లు, వ్యాయామ, పిల్లల ఆట పరికరాల ఏర్పాటుకు జివిఎంసి ద్వారా రూ.70లక్షలు మంజూరు చేసినట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు, 53వ వార్డు కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, ఇతర నేతలతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో గ్రీన్‌బెల్ట్ ఆక్రమణకు గురికాకుండా వాటిని సద్వినియోగం చేసే క్రమంలో పార్వతినగర్ గ్రీన్‌బెల్ట్‌లో రూ.20 లక్షలతో జ్యోతినగర్ గ్రీన్‌బెల్ట్‌లో రూ. 19.10 లక్షలతో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు, లక్ష్మీనగర్‌లో రూ.10.60 లక్షలతో గ్రీన్ బెల్ట్ పార్క్ అభివృద్ధి ప్లేగ్రౌండ్ నిర్మాణం, వివేకానంద నగర్ గ్రీన్ బెల్ట్‌లో రూ.20 లక్షలతో పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా పనులు త్వరితగతిన చేపట్టి, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కూటమి నాయకులు నజీర్, ఉషా కిరణ్, సురేష్ బాబు పాల్గొన్నారు.

93వ వార్డులో విస్తృత పర్యటన

పెందుర్తి: జివిఎంసి పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. . శుక్రవారం 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఎర్ర గంగరాజు, గంగవరపుల తదితరులు సమస్యలను మేయర్ కు వివరించారు ముఖ్యంగా శ్మశా వాటిక అభివృద్ధి మురుగునీటి కాలువలు, ఫుట్ పాత్‌ల పునర్నిర్మాణం, విద్యుత్ సమస్యలు, రోడ్ల అభివృద్ధి తదితర సమస్యలను విన్నవించగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా మేయర్ స్పందించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో కాలువల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. 93వ వార్డులో శ్మశానవాటిక అభివృద్ధికి టెండర్లు వేసినా, కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించ లేదని , త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఆయాప్రాంతాల్లో పారిశుధ్య సమస్యపై స్పందిస్తూ అదనపు సిబ్బంది నియామకంపై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ శైలజ, జోనల్ కమిషనర్ హైమావతి పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మాధవధార.: ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం రెండవ జోన్ ఎన్ఎస్‌టిఎల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 17న శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ విభాగం ఇఇ బికె.నాయుడు తెలిపారు మాధవధార, మాధవస్వామి ఆలయ మార్గం, తెన్నేటినగర్, ఎంఎస్ఆర్ పార్క్, కళింగనగర్ ల్యాంకో గ్రీన్స్ అపార్ట్మెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

కిశోర వికాసంపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : కిశోర బాలికలు మహిళలుగా రూపొందే కీలకమైన కౌమార దశలో ఆమెను వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికారత దిశలో నడిపించడానికి అవగాహన అవసరమని కిశోర టీం కన్వీనర్ (మహిళా సంరక్షణ కార్యదర్శి) వరలక్ష్మి అన్నారు. శుక్రవారం జివిఎంసి 51వ వార్డు గాంధీ నగర్ అంగన్వాడి కేంద్రంలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌లో భాగంగా కిశోర బాలికలకు అవగాహన కల్పించారు కిశోర బాలికల పరస్పర పరిచయం, లక్ష్యాల నిర్ధారణ ద్వారాకౌమార బాలికలను సాధికారపరచడం, వారిని స్వావలంబనగా ఉండటానికి ప్రేరేపించడం, రక్తహీనత సమస్యను అధిగమించేలా చేసి, చదువు, వృత్తి, ఆరోగ్య సంరక్షణలో ప్రోత్సాహించి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి జ్ఞానాన్ని పొందడంపై ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. అంగన్వాడీ టీచర్ మౌలాల బీబీ, ఎఎన్ఎం టి.స్రవంతి, ఆశ వర్కర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఏడాదిలోగా డిగ్రీ కాలేజీ భవన నిర్మాణం

- టెండర్లు ఖరారు చేస్తూ ఎపిఇడబ్ల్యుఐడిసి సిఇ ఉత్తర్వులు జారీ
- ఎమ్మెల్యే గంటా చొరవతో నెరవేరనున్న ఆనందపురం వాసుల కోరిక



ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి కేటాయించిన స్థలం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురంలో డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఏడాదిలోగా భవన నిర్మాణం పూర్తి చేయాలనే గడువుతో టెండరు ఖరారు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఇడబ్ల్యుఐడిసి) చీఫ్ ఇంజనీర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిగ్రీ చదువు కోసం పిల్లలను దూరప్రాంతాలకు పంపిస్తున్న ఆనందపురం పరిసర ప్రాంత వాసుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలేజీ ఏర్పాటు విషయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీసుకున్న చొరవకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ప్రస్తుతం తగరపువలస కస్తూర్బా విద్యాలయంలో ఆనందపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీని నిర్వహిస్తుండగా, ఈ కాలేజీ భవన సముదాయం కోసం పీఎం ఉషశ్రీ పథకం కింద రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. అయితే అనువైన ప్రభుత్వ స్థలం దొరక్కపోవడంతో ఆ నిధులు మురిగిపోయే పరిస్థితి వచ్చింది. కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీవాణి నిధుల వినియోగానికి గడువు మీరిపోతున్న విషయాన్ని గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గంటా, దీనిపై జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో మాట్లాడారు. ఆనందపురం హైస్కూల్ దగ్గర ఐదెకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న విషయాన్ని చెప్పారు.

భూ కేటాయింపు అనంతరం విద్యాశాఖ ఉన్నతాధికారులతో పలు దఫాలు మాట్లాడారు. భవన నిర్మాణం వేగంగా జరగాలని ఎమ్మెల్యే గంటా ఒత్తిడి తేవడంతో కేవలం రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యి పనులు మొదలుపెట్టే దశకు చేరాయి. మొదటి 4 నెలల్లో 30 శాతం, 8 నెలల్లో 70 శాతం, ఏడాదిలో వంద శాతం పనులు పూర్తి చేసి అప్పజెప్పాలని కాంట్రాక్టర్‌కు జారీచేసిన ఉత్తర్వుల్లో అధికారులు నిర్దేశించారు. హైస్కూల్, జూనియర్ కాలేజ్ సమీపంలోనే డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు కానుండడంతో ఒకే క్యాంపస్‌లో అన్ని దశల విద్యాబోధన అందుబాటులోకి రానుందని ప్రజలు సంతోషం వ్యక్తపరుస్తున్నారు.

సిబ్బంది కొరత.. సాఫ్ట్‌వేర్ ఇబ్బందులు

- ★ రైస్ కార్డుల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు
- ★ కిటకిటలాడుతున్న సచివాలయాలు
- ★ అప్‌లోడ్‌కాక గంటల తరబడి నిరీక్షణ
- ★ భూ వివరాలు అప్‌డేట్ కాకపోవడంతో లబ్ధిదారులకు తిప్పలు



రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేయడానికి వచ్చిన ప్రజలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట, వడ్డాది

రాష్ట్ర ప్రభుత్వం నూతన రైస్ కార్డుల జారీకి ఉత్తర్వులు జారీ చేయడంతో మండలంలోని గ్రామ సచివాలయాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. 15 రోజుల నుండి ఇదే పరిస్థితి ఉంది. అయితే సిబ్బంది కొరత వల్ల పని ఆలస్యమవుతుండడంతో పాటు సాఫ్ట్‌వేర్ ఇబ్బందులతో అర్జీలు అప్‌లోడ్ కావడం లేదు. దీంతో అర్జీదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

కొత్త రైస్ కార్డుల జారీ, బదిలీ, మార్పులు, చేర్పులు, సవరణలకు ఈ నెల 31 వరకు అవకాశం కల్పించడంతో లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే సిబ్బంది కొరతతో అప్‌లోడ్ ఆలస్యమవుతుంది. 10 వేలకు పైబడి జనాభా ఉన్న మండలంలోని వడ్డాదిలో రెండు సచివాలయాలకు ఒక్కరే డిజిటల్ అసిస్టెంట్ ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగా సచివాలయంలో అర్జీదారులు రోజూ గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. మండలంలోని పలు సచివాలయాల్లోనూ సిబ్బంది కొరత కారణంగా ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్ల మరమ్మతులకు గురయ్యాయి.

పెళ్లయిన వారు, పిల్లలు చేర్పులకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈనెల 31 వరకే గడువు ఉండడంతో అర్జీదారులు ఆందోళన చెందుతున్నారు. రోజు కనీసం 10 దరఖాస్తులు కూడా అప్‌లోడింగ్ అవ్వడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తుల అప్లోడింగ్‌కి ఎక్కువ సమయం పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. సాఫ్ట్వేర్ డిజైన్‌లో సైతం కొన్ని లోపాలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

అప్‌డేట్ కాని భూ వివరాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు మించి భూములు ఉన్న రైతులకు రేషన్ కార్డులతో పాటు పెన్షన్లను సైతం తొలగించారు. ఆ భూములను కుటుంబీకుల పేరుతో సరి చేసుకున్నా కూడా నేటికీ ఆ వివరాలే సాఫ్ట్‌వేర్‌లో కనిపిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన గొంపా నాయుడు 5 ఎకరాలకు మించి భూమి ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులను తొలగించి పెన్షన్ నిలిపివేశారు. తన భూమిని తన ఆరుగురు కుమారుల పేరున బదిలీ చేశారు. కానీ సాఫ్ట్‌వేర్‌లో ఆ భూమి వివరాలు కనిపిస్తుండడంతో పెన్షన్ మంజూరు కాలేదని, రేషన్ కార్డు ఓపెన్ కాలేదని ఆయన వాపోతున్నారు.



భూమి పంచుకున్నా పాత వివరాలే వస్తున్నాయి

నాకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల ఇద్దరు కలవల పిల్లలు జన్మించారు. నా భార్యా పిల్లలతో కలిపి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. నా తండ్రికి చెందిన భూమిని మా అన్నదమ్ములు అందరికీ పంచుకున్నాం. అయినా కూడా మొత్తం భూమి నా తండ్రి పేరుతోనే చూపిస్తుంది. నేటికీ పాత వివరాలే వస్తుండడంతో రేషన్ కార్డు దరఖాస్తు అప్లోడ్ కావడం లేదు.

- గొంపా వరాహమూర్తి, భార్యా పిల్లలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తాగునీటికి రూ.16.35 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలో అమృత్ 2.0లో భాగంగా తాగునీటి కోసం 16.35 కోట్లు నిధులు మంజూరైనట్లు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు జివిఎంసి ఈఈ పబ్లిక్ వర్క్ సూరిశెట్టి శేఖర్ ఇతర అధికారులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే పలు ప్రాంతాలను పరిశీలించారు. కేటాయించిన నిధులతోపనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనుల విషయంలో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని చెప్పారు. ఇప్పటివరకు ప్రతి మనిషికి 70 లీటర్ల మాత్రమే మంచినీరు సరఫరా అవుతుందని, ఈ పనులు పూర్తి అయితే 1 వ్యక్తికి 135 లీటర్లు మంచినీరు అందించవచ్చని తెలిపారు. తుమ్మపాల ప్రాంతం హెడ్ వాటర్ వర్క్స్ నుండి వుడ్ పేట ఈఎల్ఎస్ఆర్ వరకు 500 ఎంఎంపిసి పంపింగ్ మెయిన్ డిఐకె 9తో అమర్చడానికి మూడు కోట్ల 30 లక్షల రూపాయలు నిధులు, అనకాపల్లి గవరపాలెం సంతబయలు సమీపంలో పైప్లైన్లుతో సహా 1000 కేఎల్ నిర్మాణానికి (4.55) నాలుగు కోట్ల 55 లక్షలు, లక్ష్మీదేవి పేట వద్ద పైప్లైన్‌తో సహా1000 కేఎల్ఈఎస్ఈఆర్‌కి నిర్మాణానికి మూడు కోట్ల 50 లక్షలు నిధులు, హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పంపింగ్ అమరికాతో సహా 500 కేఎల్ సంప్ కమ్ పంపు హౌస్ నిర్మాణానికి రెండు కోట్ల యాభై లక్షల రూపాయలు, కొండ కొప్పాక దగ్గర సంప్ కమ్ పంప్ హౌస్ పైపులైన్లు, పంపింగ్ ఏర్పాట్లతో సహా 500 కేఎల్ జిఎల్ఎస్సార్ నిర్మాణానికి రెండు కోట్ల 50 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అనకాపల్లి చిన్నబాబు కాలనీ వాటర్ వర్క్స్ నందు నూతనంగా నిర్మాణం చేపట్టనున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను, పంపు హౌస్‌ను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పరిశీలించారు.



చంద్రబాబుతో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ

ముఖ్యమంత్రిని కలిసిన సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : అమరావతి సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలతో పాటుగా మండల పార్టీ అధ్యక్ష ఎన్నికలు తదితర అంశాలను ఆయనకు వివరించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, రానున్న మహానాడుకు పార్టీ శ్రేణుల సమీకరణ చేసే దిశగా ముందుకు పోయేందుకు పలు సూచనలను ముఖ్యమంత్రి చంద్రబాబు చేసినట్లుగా సాయికృష్ణ తెలిపారు.

నేడు పంచాయతీల్లో 'సాసా'

ప్రజాశక్తి-సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశాల ప్రకారం ప్రతి మూడవ శనివారం సాసా (ఎస్ఎఎస్ఎ) పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాసా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న మండలంలోని అన్ని పంచాయతీల్లో "బీట్ ది హీట్" అనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహించబడతాయని చెప్పారు. ఇందులో భాగంగా మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, చలి వేంద్రాలు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కలేకూరి ప్రసాద్ వర్ధంతిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజాకవి, సినీగేయ రచయిత. దళిత ఉద్యమకారుడు కలేకూరి ప్రసాద్ వర్ధంతిని ఈనెల 18న విజయనగరంలో నిర్వహించనున్నట్టు ఏపీ బహుజన కళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆతవ ఉదయభాస్కర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాటపల్లి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఎస్ఆర్. హోటల్‌లో ఉదయం 10 గంలకు కలికూరి వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని,జయప్రదం చేయాలని కోరారు.

సిహెచ్‌ఒల భారీ ర్యాలీ, మానవహారం



నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న సిహెచ్‌ఒలు శుక్రవారం అనకాపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి, అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఒలు మాట్లాడుతూ తమకు శ్రమకు తగిన వేతనం ఇవ్వడంలేదని, రూ.40వేలు ఇస్తామని రూ.25 వేలు ఇస్తున్నారని వాపోయారు. ఎఫ్ఆర్ఎస్ నుండి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు మినహాయింపు కల్పించాలన్నారు. ఐపిహెచ్ఎస్ గైడ్ లైన్స్ ప్రకారం ఆరు సంవత్సరాలు పని చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను రెగ్యులర్ చేయాలని, రద్దు చేసిన పిఎఫ్‌ను పునరుద్ధించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి మినహాయింపుతో పాటు, జీతాన్ని 23 శాతానికి పెంచాలని, వెల్నెస్ సెంటర్ల అద్దె బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంత ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ, కార్యదర్శి స్వాతి మీడియాతో మాట్లాడుతూ తాము 19 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సూర్యకళ, పావని, శ్రావణి, కల్పన, దివ్య, విశాలి, షైనీ, స్వాతి, మోజెస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సకాలంలో రుణాలివ్వాలి

ప్రజాశక్తి-చోడవరం : దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సకాలంలో రుణాలు ఇవ్వాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెఎంఎల్‌బిసి సమావేశం జరిగింది. వివిధ బ్యాంకులలో రుణాలు అందించే తీరు తెన్నులు బ్యాంకర్లును, వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలు సాధించని బ్యాంకర్లు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ వస్తున్న నేపథ్యంలో రైతులకు, కౌలు రైతులకు సత్వరమే రుణాలు అందించాలని, వారి అవసరాలకు తగ్గట్టుగా రుణాలు అందించే దిశగా పని చేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత సాధన దిశగా ప్రత్యేక ట్రైనింగ్ సిబ్బందిని క్లస్టర్స్ వారీగా నియామకం చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ద్వారా అందిస్తున్న పిఎం. సూర్యాఘర్ స్కీమ్ ద్వారా అందరు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని, అందుకు బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, పిఓపిఆర్డి మహేష్, వివిధ బ్యాంకులకు చెందిన మేనేజర్లు, నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు.

22 నుండి రాష్ట్ర ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి - కశింకోట : కశింకోటలో ఈ నెల 22, 23, 24, 25 తేదీలలో నాలుగు రోజులపాటు తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట దేవినాయుడు తెలిపారు. నాటిక పోటీల వివరాలతో కూడిన కరపత్రాలను శుక్రవారం వారు ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 నాటికలు ఎంపిక చేశామని చెప్పారు. 22న రాత్రి 9 గంటలకు విశాఖపట్నం తెలుగు కళా సమితి వారిచే 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' రాత్రి 10.15కు కాకినాడ బివికె క్రియేషన్స్ వారి 'తితిక్ష' 23న రాత్రి 8.45 గంటలకు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి 'చీకటి పువ్వు' 10 గంటలకు గుంటూరు శ్రీఅమత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' రాత్రి 11.15 గంటలకు విజయవాడ గురజాడ కళా మందిర్ వారి 'మహాప్రస్థానం' 24న రాత్రి 8.45 గంటలకు హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారి 'మూల్యం' 10 గంటలకు కొలకలూరు శ్రీసాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' రాత్రి 11.15 గంటలకు పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిలజీవి' 25న రాత్రి 9 గంటలకు గుడివాడ కృష్ణా ఆర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వార బంధాల చంద్రయ్యనాయుడు' 10.15 గంటలకు విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ వారి 'అనగనగా ఒక రాజు' తదితర నాటికలు ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల మహాలక్ష్మినాయుడు, యల్లపు మోహన్, మళ్ల రంగ, సిరిపల్లి సత్యనారాయణ, కట్టోజి బ్రహ్మాజీ, భీశెట్టి రాము, కొణతాల శ్రీను, బొడ్డేడ నూకేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు



శీతల పానీయాలు అందిస్తున్న దాడి శివ తదితరులు

ఉపాధి కూలీలకు డ్రింక్స్, బిస్కెట్ల పంపిణీ

ప్రజాశక్తి -మునగపాక : మునగపాక గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ములబంద గోడి రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శీతల పానీయాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు దాడి శివ, కార్యదర్శి ఆడారి రాము, కోశాధికారి దొడ్డి గంగ సూరి, రైతులు సూరిశెట్టి దుర్గ నాయుడు, సత్యనారాయణ, టెక్కలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను జీవీఎంసీ 81వ డివిజన్‌లో శుక్రవారం పంపిణీ చేశారు. బూత్ నెంబర్ 212, 213, 214 పరిధిలో 700 మందికి కార్డులను టిఎన్‌టియుసి పార్లమెంట్ అధికార ప్రతినిధి దాడి వీర వెంకటఅప్పారావు అందజేశారు. కార్యక్రమంలో రామోజీ శ్యాంసుందర్, శరగడం శాంతారావు, మద్దాల వరలక్ష్మి, భయ్యన గౌరీ, శరగడం సుదర్శన్, బొడ్డేడ సత్యవతి, శరగడం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది సంతబయలు నుండి కస్పా రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన స్తంభం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. ఈ స్తంభం ఎప్పుడు కూలిపోతుందో తెలియక స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్తంభం మధ్యలో బీటలు ఏర్పడడంతో ఫీజులు కొట్టేసినప్పుడల్లా విద్యుత్ సిబ్బంది ఫీజులు వేయడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



శిథిలమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం

ప్రకటనలకే పరిమితం.. ఆచరణ శూన్యం

- దోమల వృద్ధి కేంద్రంగా అనకాపల్లి
- డెంగీ నియంత్రణ దినోత్సవం పేరిట బోర్డులు
- కనీసం ఫాగింగ్ కూడా చేయని పరిస్థితి

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ పరిధిలో డెంగీ నివారణ అనేది ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్రచార బోర్డులు... ప్రత్యేక దినోత్సవ కార్యక్రమాల తప్ప ఆచరణలో లక్ష్యాన్ని ఛేదించే కార్యాచరణ ఎక్కడా కానరావడం లేదు. ఈ నెల 16న శుక్రవారం డెంగ్యూ నియంత్రణ దినోత్సవ అంటూ చిన్న బ్యానర్‌తో సరిపెట్టేశారు. దోమల నియంత్రణకు ఏం చేయాలో ఓ మూడు ఉచిత సలహాలు దానిలో రాసేసి దులిపేసుకున్నారు.

కాలువల్లో మందే కొట్టడం లేదు



గతంలో కాలువల్లో దోమలు పెరగకుండా మందులు కొట్టేవారు. ఇప్పుడు కొట్టడం లేదు. ఇప్పుడు జీవీఎంసీలో విలీనమైనా ప్రజలకు కల్పించే సౌకర్యాలు పెద్దగా ఏమీ కనిపించడం లేదు. ఎక్కడ చూసినా దోమలే. పట్టుమని నిద్ర ఉండటం లేదు. అనకాపల్లికి కొత్తవారు వస్తే జడిసిపోతున్నారు.

- టి.సత్యనారాయణ, అనకాపల్లి



డెంగీపై ఏర్పాటు చేసిన ప్రచార బ్యానర్

నిజానికి అనకాపల్లి దోమల ఉత్పత్తి కేంద్రంగా విరాజిల్లుతుందంటే అతిశయోక్తి కాదు. గతంలో బెల్లం కేంద్రంగా పేరుందిన అనకాపల్లి ఇప్పుడు దోమల కేంద్రంగా గుర్తింపునందుకుంది. కొత్తవారు ఈ ప్రాంతానికి వస్తే సాయంత్రం అయితే చాలు హడలెత్తిపోవాల్సిందే. అనకాపల్లి ఎక్కడ చూసినా దోమలే. రోడ్డు లేదు ఇల్లు లేదు ఎక్కడ చూసినా అదే బెడద. దీంతో జనం నిద్రలేని రాత్రులు గడుపుతుంటే... మరో పక్క వ్యాధుల బారిన పడుతున్నవారు ఉన్నారు.

అసలు దోమలను నియంత్రణకు అంటూ జీవీఎంసీ ఏ కార్యక్రమం చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



పేరుకుపోయిన చెత్త

ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి ఉంటుంది. అంతెందుకు ఊర్లోని చెత్త మొత్తం జీవీఎంసీ జోనల్ కార్యాలయం పక్కనే డంప్ చేస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అనకాపల్లిలో సేకరించిన చెత్తను అక్కడ వేశాకే వేరే డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. కాలువల్లో దోమల పెరగకుండా లార్వాను నాశనం చేసే పిచికారి చేసేవారు. ఇప్పుడు అటువంటి కార్యక్రమం ఎక్కడ కానరాలేదన్నది జనం మాట. కనీసం దోమలను చంపే ఫాగింగ్ కూడా నివాస ప్రాంతాల్లో చేయడం లేదు. మున్సిపాలిటీ నుంచి జీవీఎంసీ స్థాయికి అనకాపల్లి పెరిగింది గాని ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. నానాటికీ దోమలు పెరుగుతున్నాయి తప్ప తగ్గే పరిస్థితి ఎక్కడ కనబడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో డెంగీ నివారణ



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల భాగస్వామ్యంతో డెంగీని నియంత్రించవచ్చని మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎస్.ప్రసాదరావు అన్నారు. నేషనల్ డెంగీ డేను శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. సిబ్బందితో ర్యాలీ చేపట్టారు. జివిఎంసి బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎంపిహెచ్ఐఒ తిరుపతిరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, జివిఎంసి యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార : జాతీయ డెంగ్యు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్.పి.రాధారాణి జెండా ఊపి ప్రారంబించారు. డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది., అడిషనల్ డైరెక్టర్ కెవిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం డెంగీ డే థీం సిసిసి.(చెక్, క్లీన్, కవర్) పరిశీలించడం, శుభ్రపరచడం, మూతలు పెట్టడం వలన దోమలు కుట్టకుండా చాలావరకు నివారించవచ్చని వివరించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, జివిఎంసి బయోలజిస్ట్ జి.సాంబమూర్తి, మలేరియా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక : జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం సుధాకర్ మాట్లాడుతూ ఎవరికైనా జ్వరం, శరీరంపై దద్దుర్లు ఉంటే వెంటనే పిహెచ్‌సికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్వైజర్స్ రాము, సురేష్, హెచ్ వి రత్నాలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల : డెంగీ దోమ నివారణకు సిబ్బంది నివారణ చర్యలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వర్ణ, ప్రత్యూష సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వెంకటాపురం పిహెచ్సి పరిధిలో ర్యాలీ నిర్వహించారు. డెంగీ జ్వరం పట్ల నిర్లక్ష్యం చేయరాదని, సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మూలపేట గ్రామంలో వైద్యాధికారి ఎన్.విమల గిరి ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కశింకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కశింకోట : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కశింకోట, తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారిలు ఎస్.తిరుపతి రావు, ఎం.మునిషా ఆధ్వర్యంలో శుక్రవారం డెంగ్యూపై అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, ఎం.ప్రసాద్‌రావు, పి.నరసింహారావు, సత్యదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడ : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు, ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ కరిష్మా, వైద్య సిబ్బంది ఎంఎస్ఎస్ సాయిరాం, ఎన్.జానకిరామన్, వెంకటరావు, చైతన్య, విజయ కుమారి, అన్నపూర్ణేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.307 వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా రోజుకు రూ.307 చొప్పున వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. మండలంలోని కొండకర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను శుక్రవారం ఆయన కలిసి మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.307 చెల్లించాలని కోరారు. కూలీలకు చెల్లించాల్సిన ఐదు వారాల వేతన బకాయిలు తక్షణమే ఇవ్వాలన్నారు. గతంలో ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మంచినీళ్ళు, పనిముట్లు అలవెన్స్, నీడకోసం టెంట్, ఎండాకాలంలో మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, సమ్మర్ అలవెన్స్, 5 కిలోమీటర్లు దాటితే రాను, పోను ఛార్జీలు, ప్రతి వారం పేస్లిప్పు ఇచ్చేవారని తెలిపారు. కాని నేడు అవన్నీ తీసేశారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము

బకాయిలు చెల్లించాలని..

ఉపాధి హామీ కూలీల వినూత్న నిరసన

ప్రజాశక్తి- చీడికాడ:ఉపాధి హామీ కూలీలకు ఎనిమిది వారాల బకాయిలు చెల్లించాలని శుక్రవారం చీడికాడ మండలం అర్జునగిరి పని ప్రదేశంలో మన్ను తింటూ కూలీలు పెద్ద ఎత్తున ఆందోళన చేసారు. బిల్లులు చెల్లించె వరకు దశల వారిగా ఆందోళన చేస్తామని స్పష్టం వారు చేసారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న మాట్లాడారు. మార్చి ఇరవై నుండి ఈరోజు వరకు కూలీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం అమలు అస్తవ్యస్తంగా మారిందని దుయ్యబట్టారు. బకాయిలు చెల్లించక పోవడంతో పేదలు ఆకలితో అల మటిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు దొరకని ప్రస్తుత వేసవి రోజుల్లో ఉపాధి హామీ పథకం పై ఆధారపడి జీవించే పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కూలీలకు 15 రోజుల లోపే వారి పనికి సంబంధించిన కూలీ డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇలాగైతే ఎలా బతకలాలని ప్రశ్నించారు.సమ్మర్ ఎలవెన్సు, తట్ట, గునపాం వంటి వాటిని ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్ర మంలో అధిక సంఖ్యలో కూలీలు, నాయకులు, తదతరులు పాల్గొన్నారు.



మట్టిని చేతులతో పట్టుకుని నిరసన చేపడుతున్న కూలీలు



నాయకులతో సమీక్షిస్తున్న హోంమంత్రి అనిత

22న అడ్డురోడ్డులో మినీ మహానాడు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో ఈనెల 22 తేదీన మినీ మహానాడు నిర్వహించనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. నక్కపల్లి లో హెూంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షులు తాతయ్యబాబు, బీజేపి జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు, పాయకరావుపేట టిడిపి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, మినీమహానాడు ఏర్పాట్లపై సమీక్షించారు. ఘనంగా నిర్వహించేందుకు గాను కమిటీలను నియమించారు. పలువురు ముఖ్య నాయకులకు బాధ్యతలను అప్పగించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు మిని మహానాడుకు హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి ముఖ్య నేతలు కొప్పిశెట్టి వెంకటేష్, లాలం కాశీ నాయుడు, కొప్పిశెట్టి బుజ్జి, నాయకులు పాల్గొన్నారు.



హోం మంత్రితో లింగన్ననాయుడు

టిడిపి మండల అధ్యక్షునిగా లింగన్న నాయుడు

ప్రజాశక్తి -కోటవురట్ల:టిడిపి మండల అధ్యక్షునిగా లింగన్ననాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం రాష్ట్ర హెూం మంత్రి అనిత నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రకటించారు, ప్రధాన కార్యదర్శిగా ఎలమంచిలి సూర్య ప్రకాష్‌ను నియమించారు. లింగన్న నాయుడు ప్రస్తుతం బీకేపల్లి గ్రామ సర్పంచ్ గా, ఎలమంచిలి సూర్య ప్రకాష్ కొడవటిపూడి ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె కార్యకర్తలను క్యాడర్ను సమన్వయ పరుచుకుంటూ పార్టీ అభివృద్ధికి పని చేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు టిడిపి నాయకులు అభినందనలు తెలియజేసారు.

అనారోగ్యంతో టెన్త్ విద్యార్థి మృతి



మణికంఠ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-కొత్తకోట:పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన కన్నంపేట గ్రామానికి చెందిన సియాద్రి మణికంఠ అనారోగ్యానికి గురై మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కన్నంపేట గ్రామానికి చెందిన సింహాద్రి నాని, అమ్మాజీ కుమారుడు మణికంఠ కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివాడు. ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రధమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. సామాన్య కుటుంబానికి చెందిన మణికంఠ చిన్నప్పటి నుంచి చదువుపై మంచి శ్రద్ధ కనబరుస్తూ ఉండే వాడు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కావడంతో పలువురు మణికంఠను ఎంతో అభినందించారు. 15 రోజుల క్రితం మణికంఠ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఊపిరితిత్తుల్లో సమస్య ఏర్పడడం, హార్ట్ బీట్, ప్లేట్లెట్స్ తగ్గడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం విశాఖ ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుండడంతో పలువురు దాతల సైతం ఆర్థిక సహాయం అందించారు. పరిస్థితి విషమం గా ఉండటంతో కేజీహెచ్‌కు తరలించారు. చదువుతో పోరాడి విజయం సాధించిన విద్యార్థి మణికంఠ మృత్యువుతో పోరాడ లేక పోయాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

బాత్‌రూమ్‌లో జారిపడి

ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ మృతి



సతీష్ కుమార్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట స్టేట్ బ్యాంకు లో ఫీల్డ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న సతీష్ కుమార్(45) శుక్రవారం ఉదయం బాత్ రూమ్ లో ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందారు. నర్సీపట్నం శారద నగర్‌లో కుటుంబంతో సహా నివాసం ఉంటున్న ఆయన ఉదయం కాల కృత్యాలు కోసం బాత్ రూమ్ కు వెళ్లడం తో కాలు జారీ ప్రమాదవ శాత్తు పడిపోవడం తో ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు చెప్పారు. ఈ ప్రమాదం జరిగిన సమయం లో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో సరైన సమయం లో వైద్యం అందక మృతి చెందారని వారు తెలిపారు. గత మూడేళ్ల గా కొత్తకోట బ్రాంచ్ స్టేట్ బ్యాంకు లో పీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి అందరిలో గుర్తింపు పొందారు. ఆయన భార్య జాహ్నవి అల్లూరు జిల్లా లో వ్యవసాయ శాఖ లో ఏడిగా విధులు నిర్వహిస్తున్నారు. సతీష్ కుమార్ కు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పలుచోట్ల తిరంగా ర్యాలీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పిస్తూ నక్కపల్లి లో శుక్రవారం సాయంత్రం హెూం మంత్రి వంగలపూడి అనిత కూటమి శ్రేణులతో కలిసి తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ కు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించారని, పాక్ పై మన సైనికులు వీరోచితంగా పోరాటం చేశారన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు నిర్వహించారన్నారు. 23 సంవత్సరాలు మురళీ నాయక్ మృతి చాలా బాధాకరం అని అన్నారు. రైల్వేలో మురళీనాయక్ కు ఉద్యోగం వచ్చినా, దేశ రక్షణ కోసం సైన్యంలో చేరారని, ఆ కుటుంబ సభ్యులకు మనమంతా అండగా నిలవాలన్నారు.

యలమంచిలి : దేశ సరహద్దుల్లో మనకు రక్షణగా నిలిచి శత్రువుల ఘాతకాలను ఎప్పటిప్పుడు ప్రతిఘటిస్తూ తిప్పుకొడుతున్న 'రక్ష కదళ' కుటుంబ సభ్యుల్ని గుర్తించి సత్కరించుకోవలసిన అవసరం ఏర్పడిందని మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి ఉద్బోధించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన 'జై జవాన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు నక్కా శివశంకర్, కూటమి నాయకులు ఊటకూటి రమేష్‌నాయుడు, కొఠారు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సహాయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గంజాయి కేసులో చిత్తూరు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉంటూ మృతి చెందిన సరమండ ప్రదీప్ కుమార్ (26) కుటుంబానికి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో అందజేసారు. జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టు గ్రామానికి చెందిన సరమండ రాధాకృష్ణ కుమారుడు ప్రవీణ్ కుమార్ గంజాయి కేసులో పట్టు బడటంతో చిత్తూరు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉంటూ మృతి చెందాడు.జాతీయ మానవ హక్కుల సంఘం సిఫారసు మేరకు బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ అందజేసారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, డిఆర్ఓ కె.పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి రాజీవ్ నగర్ కాలనీలో శుక్రవారం వరసిద్ధి వినాయక ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకను ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో సామూహిక అభిషేకాలు, గణపతి హెూమం వంటి పూజా కార్యక్రమాలను పురోహితులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రఘు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి- నక్కపల్లి: నిత్యం యోగా చేయడంతో ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.రఘు అన్నారు. మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వద్ద యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. చిన్నప్పటి నుంచి యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాల్లో సాధన చేస్తే దీర్ఘ కాలిక వ్యాధులు సహా అనేక వ్యాధులు దరి చేరవన్నారు. పిల్లల్లో చురుకుదనం, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. జూన్ 21న విశాఖ కేంద్రంగా ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. ఆ రోజు యోగా ప్రదర్శనకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నరసమ్మ, యోగా శిక్షకులు డి.రాంబాబు, సాయి పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న అడిషనల్ ఎస్‌పి

యుజెఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ (యూజెఎఫ్) అధ్యక్షులు ఎంఆర్ఎం.వర్మ సారధ్యంలో రూపొందించిన డైరీ, పాకెట్ బుక్‌ను శుక్రవారం ఎస్పీ కార్యాలయ ఆవరణంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ హితమే ధ్యేయంగా జర్నలిస్టులు పనిచేస్తారని, ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.రాము, డి.హరనాథ్, భీమరశెట్టి వెంకటేష్, షేక్ షాంద్ బాషా, కాంద్రేగుల మోహన్‌బాబు, పైలా రామారావు, బయ్యా కొండలరావు, ఈ షణ్ముఖ, మొల్లేటి గంగాధర్, గంటా శ్రీనివాసరావు, పొలిమేర నాగ శ్రీను, కోరుబిల్లి గణేష్, సింగర్ రాజు, బోని గణేష్, వై.నాగు, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

-కూలిన గృహాలు
-పశువులు మృత్యువాత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయితీ గొందివలస గ్రామంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా ఏకధాటిక కురిసిన వర్షానికి తామర్ల. చిన్న పొట్టన్న, గెమ్మెలి. వెంకట్రావు అనే గిరిజనుల రెండు నివాస గృహాలు నేలమట్టం అయ్యాయి. ఈదురుగాలుల వర్షం కారణంగా హఠాత్తుగా గహాలు నేలమట్టమవడంతో వారి వారి వస్తువులతో పాటు వినియోగించే ఆహార పదార్థాలైన ధాన్యం, తదితర వంటి ఆహార దిన్సులు, వినియోగించే సామాగ్రిలు పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బాధిత గిరిజనుల అంటున్నారు. ఈ విషయంపై మండల అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు అధికారులకు కోరుతున్నారు.

హుకుంపేట: మండలానికి సమీపాన జికె మండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలకు పిడుగు పడి 9 పశువులు మృతి



గొందివలసలో కూలిన ఇల్లు

చెందాయి. చీడీపుట్టు గ్రామానికి చెందిన పశువుల కాపరులు తమ పశువులకు గ్రామ సమీపాన గల పొలాలలో మేతకు తీసుకొచ్చారు. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. భారీ వర్షాలకు పొలానికి సమీపాన గల మామిడి చెట్టు కిందకు పశువులన్నీ చేరాయి. మెరుపులతో కూడిన పిడుగు పడటంతో 9పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి.



చెక్కును అందజేస్తున్న ఎస్‌బిఐ అధికారులు

రూ.20 లక్షల బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి: పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు 2023 డిసెంబరు 29 న కందిపూడి చెరువు వద్ద భారీ క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (మెయిన్) లో మృతి చెందిన నాగేశ్వరరావుకు సేవింగ్ అకౌంట్ ఉంది. ఈ ఖాతా ద్వారా ప్రమాద భీమా పాలసీ తీసుకున్నాడు. ఈ మేరకు ప్రమాదవశాత్తు మరణించిన నాగేశ్వరావు కుటుంబానికి 20 లక్షలు భీమా నగదు మంజూరు అయింది. పాయకరావుపేటలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో శుక్రవారం మృతుడు భార్య కొంకిపూడి పద్మావతికి 20 లక్షల భీమా చెక్కును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అనకాపల్లి రీజనల్ మేనేజరు ఎస్ సతీష్ చంద్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ జనరల్ ఇన్స్యూరెన్స్ ఏరియా మేనేజరు జి సురేష్ బాబు, అనకాపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ ఎమ్ మోహన్ రెడ్డి, బ్రాంచి మేనేజరు ఎన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు.. అప్పలరాజు



ప్రజాశక్తి - విశాఖపట్నం

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మోటారు ట్రాన్స్‌పోర్టు యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు గుండెపోటుతో ఈ నెల 6న కన్నుమూయడం పలువురిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ రోజు వేకువజామున రాజాంలో ఆయన మృతిచెందారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆయన 1965 డిసెంబర్ 25న జన్మించారు. 1991-92 ప్రాంతంలో బతుకుదెరువు కోసం విశాఖకు వచ్చారు. అప్పటి నుంచి కార్మిక ఉద్యమంలో మమేకమయ్యారు. క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ సభ్యునిగా, విశాఖ జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పనిచేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై కేంద్రీకరించి ఉద్యమించారు. భూపోరాటాలు చేసి, విజయం సాధించి పెందుర్తి, గోపాలపట్నం ప్రాంతాల ప్రజల మన్ననలు పొందారు. కార్మికనగర్, గాంధీనగర్, మీనాక్షమ్మనగర్, ఆంజనేయనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై పోరాడారు. ఆయా ప్రాంతాల్లో ఇళు వేయించి పట్టాలు సాధించే వరకూ అహర్నిశలూ ఆయన అనేక పోరాటాలు చేశారు. పెందుర్తిలో ఎర్రజెండా ఎగరడానికి అప్పట్లో టిడిపి, కాంగ్రెస్ బడా నేతలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా బెదరకుండా ఎర్రజెండా పట్టి నిలబడ్డారు. సిపిఎం, సిఐటియుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. కార్మికనగర్ సహా నల్లక్వారీ, గాంధీ నగర్, ఆంజనేయులనగర్‌లలో పేదల కోసం పాకలు వేసి పోరాటాలు నడపడంతో ఆయన అక్కడివారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన్ని స్మరించుకుంటూ కార్మికనగర్‌లో స్తూపాన్ని ఏర్పాటు చేశారు. దాన్ని ఈ నెల 15న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆవిష్కరించారు.